క్లుప్తంగా

375 మందికి వైద్య పరీక్షలు



మోహనాపురంలో వైద్య సేవలందిస్తున్న వైద్యులు

గంగవరం : మండలంలోని మోహనాపురంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 18 గ్రామాలకు చెందిన సుమారు 375 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు ఆంధ్రా వనవాసి కళ్యాణ ఆశ్రమం జిల్లా అధ్యక్షుడు బొగ్గుల కాటంరెడ్డి తెలిపారు. శిబిరంలో విశాఖకు చెందిన వైద్య నిపుణులు శ్రీనివాసరావు, దువ్వల పాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి స్పందన, వైద్య సిబ్బంది ఉషారాణి, ఆశ్రమ హెల్త్ కమిటీ సభ్యులు రాంబాబు, వీరపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్కా రహదారుల కల్పనే లక్ష్యం



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి

ముంచంగిపుట్టు: గ్రామాలకు పక్క రహదారులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తామని సర్పంచ్ నరసింగరావు అన్నారు. మండలంలోని జర్రెల పంచాయతీ బొడ్డగొంది గ్రామం నుంచి ఏనుగురాయి పంచాయతీ కిమ్మలమామిడి గ్రామం వరకు 15 కిలోమీటర్ల మట్టిరోడ్డు పనులకు ఆదివారం సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, నాయకులు పూజలు చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ నరసింగరావు మాట్లాడుతూ కిమ్మలమామిడి గ్రామానికి సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్నా దృష్ట్యా మట్టి రోడ్డు వేస్తున్నామని, ఉన్నతాధికారులతో మాట్లాడి తారురోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉప సర్పంచ్ గణపతి, వైఎస్సార్‌సీపీ నేత సురేష్, తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సన్మానం



టీచర్ మల్లికార్జునరావు దంపతులను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పనిచేస్తూ దేశిది మల్లికార్జునరావు ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు సహచర ఉపాధ్యాయులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆత్మీయ అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు, ఆయన సతీమణి వెంకట విజయ లక్ష్మిలను ఘనంగా సత్కరించారు. పలువురు మాట్లాడుతూ మల్లికార్జునరావు మాస్టర్ ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చారని కొనియాడారు. ఎందరిలో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేర్చేందుకు ఆయన విశేష కృషి చేశారన్నారు.సుమారు నాలుగు దశాబ్దాల పాటు ఆయన ఉపాధ్యాయ వృత్తిలో విద్యాభివృద్ధికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఉపాధ్యాయులు, వివిధ శాఖల ఉద్యోగులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గూడుపమ్మ ఆలయానికి ఆషాడ శోభ



గూడుపమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

- వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక
- అమ్మవారికి ప్రత్యేక పూజలు

నక్కపల్లి: ఆషాడ మాసం, ఆదివారం కావడంతో రేబాక గూడుపమ్మ తల్లి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తుని, పాయకరావుపేట, నక్కపల్లి, అడ్డురోడ్డు నర్సీపట్నం, ఎలమంచిలి తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతి ఆది, గురు, మంగళవారాల్లో అమ్మవారి ఆలయానికి భక్తులు వచ్చి కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయ ప్రాంగణంలోనే వంటావార్పు చేసుకుని సాయంత్రం తిరుగు ప్రయాణమవుతారు. ఆలయ ప్రాంగణం పచ్చని వాతావరణంలో విశాలంగా ఉండటం, చుట్టూ ఎత్తయిన కొండల మధ్య అమ్మవారి ఆలయం ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి రావడానికి ఎక్కువగా ఇష్టపడతారు. మెరక గ్రామాల ప్రజలు ఇలవేల్పుగా కొలిచే అమ్మవారి ఆలయం వారాంతపు రోజుల్లో కిటకిటలాడుతోంది.

సమస్యలతో సతమతం



కూరుకుపోయిన మినీ టిప్పర్ వాహనం

- అధ్వానంగా కల్వర్టు
- దెబ్బతింటున్న వాహనాలు
- రాకపోకలకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు

జి.మాడుగుల: మండలంలో మత్స్యపురం- కుంబిడిసింగి రోడ్డు మార్గంలో అడ్డంగిసింగి, రాళ్లగెడ్డపై బ్రిడ్జిలు, హైలెవెల్ వంతెనలు లేకపోవడంతో కొద్దిపాటి వర్షం వచ్చినా వర్షపునీరు ముంచెత్తుతోంది. దీంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయని స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు మార్గంలో ఉన్న గెడ్డలు దాటడం సాహసంగా మారిందని వారు చెబుతున్నారు. కుంబిడిసింగి పంచాయతీలో 8 గ్రామాలున్నాయి. సుమారు 2300మంది నివసిస్తున్నారు. వర్షాకాలంలో, అకాల వర్షాలకు గెడ్డలు ప్రమాదకంగా పొంగి ప్రవహిస్తుండడంతో వేరేప్రాంతాలతో సంబంధాలు తెగిపోతున్నాయంటున్నారు. అధికారుల ఈ రోడ్డు మార్గంలో గల గెడ్డలను పరిశీలించి బ్రిడ్జిల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి ఏడాది కావస్తున్నా నేటికి కార్యరూపం దాల్చలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

అందని అత్యవసర సేవలు

కుంబిడిసింగి పంచాయతీల్లో గల పాఠశాలలకు వచ్చి విధులు నిర్వహించే ఉపాధ్యాయులు వర్షాకాలంలోను, అకాల వర్షాలు కురిసినప్పుడు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ రోడ్డు మార్గంలో గల గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ సామగ్రి వాహనాల ద్వారా తరలించుకోనే వారు గెడ్డల వలన ఇబ్బందులు తప్పడంలేదని చెబుతున్నారు. అడ్డంగిసింగి, రాళ్లగెడ్డ గ్రామాల సమీపంలో గెడ్డలపై గతంలో నిర్మించిన లోలెవెల్ పైపు కల్వర్టులు శిథిలావస్థలో ఉండడంతో వర్షాలకు దెబ్బతినడంతో టిప్పర్, జీపులు, ఆటోలు, లారీలు రాకపోకలు సాగించలేకపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర వాహనాలు 108 వంటివి గ్రామాలకు రాలేకపోతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. డీఆర్ డిపోల ద్వారా నిత్యావసర సరకులు తీసుకోవటానికి రేషన్‌దారులు మరింత ఇక్కట్లు ఎదుర్కొంటున్నారనిరు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టి సారించి అడ్డంగిసింగి, రాళ్లగెడ్డ గ్రామాల వద్ద గెడ్డలపై హైలెవెల్ వంతెనలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



కుంబిడిసింగి రోడ్డు మార్గంలో అడ్డంసింగి వద్ద కల్వర్టు దుస్థితి

అధ్వాన దారితో ఇక్కట్లు

పాడేరు రూరల్: మండలంలో పర్యాటక కేంద్రంగా పేరొందిన డల్లాపల్లి రోడ్డు అధ్వానంగా మారింది. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు అమ్మవారి పాదాల నుంచి డల్లాపల్లి వరకు రోడ్డు పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తోంది. ఈ మార్గంలో రహదారికి ఇరువైపులా అంచులు కోతకు గురవడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించే క్రమంలో వాహనాలు గోతుల్లో పడి వాహనచోదకులు గాయాలపాలవుతున్నారని చెబుతున్నారు. సమస్య పరిష్కారానికి పలుమార్లు అధికారులకు వినతులు ఇచ్చినా ప్రయోజనం ఉండడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



కోతకు గురైన డల్లాపల్లి రోడ్డు

అంధకారంతో అవస్థలు



వీధిలైట్లు లేక అంధకారంలో ఉన్న రాజవొమ్మంగి ప్రధాన కూడలి

రాజవొమ్మంగి: మండలకేంద్రం రాజవొమ్మంగిలోని ప్రధాన కూడలి (అల్లూరి జంక్షన్) విద్యుత్‌దీపాలు లేక అంధకారం ఆలముకొంది. ఈ కూడలి వద్ద అనేక దుకాణాలున్నాయి. అలాగే ఇదే కూడలి వద్ద పోలీస్‌స్టేషన్, బస్‌స్టాప్ కూడా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతం మీదుగా ఇటీవల ఎన్‌హెచ్516ఈ రోడ్డు రూపుదిద్దుకుంది. ఈ రహదారి నిర్మాణంలో భాగంగా పంచాయతీకు చెందిన వీధి దీపాలు తొలగించి, హైవేకు సంబంధిన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. కాగా ఈ స్తంభాలకు విద్యుత్ సరఫరా ఇవ్వకపోవడంతో లైట్లు వెలగడం లేదు. ఇటు పంచాయతీ లైట్లు, అటు హైవేకు చెందిన లైట్లు కూడా వెలగకపోవడంతో ప్రధానకూడలిలో అంధకారంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడే ప్రమాదకరమైన మలుపు ఉందని, ప్రమాదాలు జరుగకముందే ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

చోడమాంబికకు మంగళసూత్రాలు బహూకరణ

అచ్యుతాపురం రూరల్: చోడమాంబిక అమ్మవారికి రెండున్నర తులాల మంగళసూత్రాలు నెల్లూరుకు చెందిన భక్తులు శ్రీనువాసరావు నూకరత్నం, సాంబశివరావు సోమురత్నం దంపతులు బహూకరించారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ వడిశల సన్యాసినాయడుకు అందజేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశార

షార్ట్ సర్క్యూట్‌తో పూరిళ్లు దగ్ధం



అగ్నిప్రమాదానికి గురైన తెల్లం వెంకయ్య ఇల్లు



అగ్ని ప్రమాద బాధితులకు సాయమందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత వెంకట రామారావు

కూనవరం: మండలంలోని గండికొత్తగూడెం గ్రామంలో శనివారం రాత్రి జరిగిన షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో ఓ పూరిల్లు దగ్ధమై సుమారు రూ.4.50లక్ష ఆస్తినష్టం జరిగింది. ప్రమాదానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గండికొత్తగూడెం గ్రామానికి చెందిన తెల్లం వెంకయ్య తన కుటుంబంతో నిద్రిస్తున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా ఇల్లంతా మంటలు వ్యాపించాయి. వెచ్చదనానికి మెలుకువ వచ్చిన వెంకయ్య కేకలేస్తూ కుటుంబ సభ్యులను తీసుకొని బయటకు పరుగులు తీశాడు. స్థానికులు వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తూనే ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను అదుపులోకి తెచ్చింది. అగ్ని ప్రమాదంలో 50 క్వింటాళ్ల ధాన్యం, రెండు క్వింటాళ్ల బియ్యం, రూ. 50 వేలు విలువైన బంగారం, గృహోపకరణాలు మంటల్లో కాలిబూడిదయ్యాయి. ఈ సంఘటనలో బాధితుడు వెంకయ్య సర్వం కోల్పోయినట్టు స్థానికులు తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే వీఆర్‌ఓ రాజారావు ఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. వెంకయ్య కుటుంబానికి 25 కేజీల బియ్యం అందజేశారు. పెదార్కూరు సర్పంచ్ నాగమణి గండి కొత్తగూడెం వెళ్ళి అగ్నిప్రమాదానికి గురైన బాధితుడు తెల్లం వెంకయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం తక్షణ సహాయం అందజేయాలని, పక్కా ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఎటపాక: మండలంలోని కృష్ణవరం పంచాయతీ చిన్నగట్టు గ్రామంలో ఆదివారం చోటు చేసుకొన్న విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు పూరిళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఇంట్లో సామగ్రి, ఆహార ధినుసులు సర్వస్వం కాలిబూడిదయ్యాయి. కాగా అగ్నిప్రమాదం సంభవించి సర్వస్వం కోల్పోయిన బాధితులను వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు వెంకట రామారావు పరామర్శించి సహాయం అందించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా చిచ్చడి ప్రకాశ్, చిచ్చడి జనార్థన్‌లకు చెందిన రెండు పూరిళ్లు దగ్ధమవడంతో ఆయా కుటుంబాలు కట్టుబట్టలతో వీధిన పడ్డారు. విషయం తెలిసిన వెంకట రామారావు ఆయా అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించి వారికి తక్షణ సహాయంగా రూ. 2వేలు నగదు, బియ్యం, నిత్యావసర సరకులు, కూరగాయలు అందజేశారు. ప్రమాద ఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి ప్రభుత్వ సహాయం అందేలా చూస్తానని వెంకట రామారావు వారికి ధైర్యం చెప్పారు. కాగా రెవెన్యూ, పంచాయతీ అధికారులు వచ్చి నష్టం అంచనా వేశారు. సర్పంచ్ కృష్ణ, నాయకులు సత్యనారాయణ, దివాకర్, నవీన్, శ్రీను, రామారావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రహదారి పనులు



శ్రమదానంతో రహదారి బాగు చేస్తున్న తొటపుట్టు గ్రామ గిరిజనులు

ముంచంగిపుట్టు: సీసీ రోడ్డు మంజూరు చేయాలని మండలంలోని సుజనకోట పంచాయతీ తొటపుట్టు గ్రామ గిరిజనులు కోరుతున్నారు. ఆదివారం గ్రామానికి వచ్చిన బోర్‌వెల్ లారీ బురదలో కూరుకుపోయింది. దానిని బయటకు తీసేందుకు గ్రామస్తులు నానా అవస్థలు పడ్డారు. కాలినడకన వెళ్లేందుకు సైతం ఇబ్బందులు పడ్డారు. దీంతో శ్రమదానం చేసి రాకపోకలు జరిగే విధంగా రహదారిని బాగు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ గిరిజనులు మధు, నారాయణ, భాగత్‌రాం, సుబ్బరావులు మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామం నుంచి ప్రధాన మార్గం వరకు చిత్తడిగా మారుతుందని, రాకపోకలకు పడరాని పాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ రోడ్డు మంజూరు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందన లేదని, 500 మీటర్ల సీసీ రోడ్డు వేస్తే రాకపోకల ఇబ్బందులు తొలుగుతాయని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సీసీ రోడ్డు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ శ్రమదానంలో తొటపుట్టు గ్రామ గిరిజనులు పాల్గొన్నారు.

6న అమ్మవారి బోనాల పండగ

అడ్డతీగల: మండలంలోని వేటమామిడి శివారున వేంచేసిన రేణుకా ఎల్లమ్మ చిన్నమస్తాదేవి అమ్మవార్ల బోనాల పండుగ జులై 6న నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ అర్చకుడు ముర్ల రాజారెడ్డి తెలిపారు. ఉత్తరాయణం గ్రీష్మరుతువు ఆషాఢమాసం శుక్లపక్షం తొలిఏకాదశి పర్వదినమైన ఆరోజ వేకువజామునే 5 గంటలకు రేణుకా ఎల్లమ్మ చిన్నమస్తాదేవి అమ్మవార్లకి అభిషేకం, ప్రత్యేక పూజాధికాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అమ్మవార్లకు మహిళలచే బోనాల సమర్పణ జరుగనున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నధాన సమారాధన నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు కుంభం పూజ చేస్తామన్నారు. ఈ పండుగలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొవాలని కోరారు.

నేడు కలెక్టరేట్‌కు తరలిరండి

కొయ్యూరు: ఉపాధి హామీలో జరుగుతున్న అవినీతిపై విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పాడేరులో కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్యక్రమంలో సర్పంచ్‌లు, నేతలు, కార్యకర్తలు పాల్గొవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.అప్పారావు తెలిపారు. ఆయన ఆదివారం కొయ్యూరులో విలేకరులతో మాట్లాడారు. ఉపాధి చట్టం ప్రకారం పనులు పంచాయతీల ద్వారానే జరిపించాలని, సకాలంలో కూలి డబ్బులు చెల్లించాలన్నారు. సర్పంచ్‌లకు తల్లికి వందనం వర్తింప చేయాలన్నారు. కేంద్రం విడుదల చేసి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1150 కోట్లు తక్షణమే పంచాయతీలకు జమ చేయాలన్నారు. జీవో నెంబర్ 11ను రద్దు చేసి , 1350 మంది కార్యదర్శులకు ఉద్యోగాలు ఇచ్చి పది నెలల పెండింగ్ జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. వసూలు చేస్తున్న ఇంటి పన్నులను స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేయాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీల గౌరవవేతనాన్ని వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శి అచ్యుత్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు నర్సి కృష్ణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి మునిలినాయుడు, నాయకులు రామారావు, కిరణ్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అప్పారావు, నేతలు

విస్తృతంగా కర్ర పెండలం సాగు

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో కర్రపెండలం పంటను విస్తారంగా రైతులు సాగుచేస్తున్నారు. ప్రధానంగా ఈ పంటను మెట్ట ప్రాంత గ్రామాలైన గరుగుబిల్లి, గొండుపాలెం, దాలివలస, కొరువాడ, డి.అగ్రహారం, ఆర్లి, ఎరకన్నపాలెం, పింద్రంగి గ్రామాల్లో 100ఎకరాల్లో సాగుచేస్తున్నారు. మెట్ట ప్రాంత గ్రామాల్లో గల భూములు ఈ పంటకు అనుకూలంగా ఉండి సాగు వల్ల కర్ర పెండలం దుంపలు దిగుబడి అధికంగా ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలు పంటకు మేలు చేయనున్నట్టు రైతులు తెలుపుతున్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న కర్ర పెండలం సాగు మరో 15 రోజుల్లో పంట చేతికి అందివస్తుందని సాగు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ వరి నారుమళ్లు

మాడుగుల రూరల్ : ఇటీవల ఆడపా దడపా కురిసిన వర్షాలకు రైతులు బిజీబిజీగా వరినారు మడులు వేసే పనిలో ఉన్నారు. రైతు సేవా కేంద్రాలు ద్వారా వరి విత్తనాలు కొనుగోలు చేసి, పంట పొలాల్లో వరి నారుమడుల్లో వరినారు వేసే పనిలో ఉన్నారు. కాగా శనివారం అర్ధరాత్రి నుంచి ఆడపా దడపా వర్షం కురుస్తుంది. ఆదివారం కూడా ఒక మోస్తరుగా వర్షం కురిసింది. ఈ వర్షాలకు రైతులు వరి విత్తనాలు చల్లి నారు మడులు సిద్ధం చేస్తున్నారు.

వరాహావతారంలో జగన్నాథుడు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గూడ్స్‌రోడ్డు ఇంద్రద్యమ్న హాల్‌లో కొలువైన సుభద్ర బలభద్ర జగన్నాథస్వామి వరాహ అవతారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొన్నారు. ఆలయ ప్రాంగణంలో వెలగా ప్రవీణ, మెల్లేటి సరళ ఆధ్వర్యంలో సంకీర్తనలు, కోలాటం ప్రదర్శనలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ, శ్రీరామ్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యే పూజలు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ కార్యనిర్వాహణాధికారి బీ మురళీకృష్ణ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

కశింకోట: స్థానిక దేవాదాయ శాఖకు చెందిన వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు వరాహావతారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని వరాహావతారంలో అలంకరించి విష్ణు సహస్ర నామార్చన చేసి భక్తుల గోత్ర నామాలతో అర్చించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్చకులు సీతారామాచార్యులు, మారుతి, రామచరణాచార్యులు పాల్గొన్నారు.



వరాహావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథ స్వామి

వారాహిదేవిగా కనకదుర్గ అమ్మవారు

అనకాపల్లి: అష్టమి వార్షికోత్సవం సందర్భంగా స్థానిక గవరపాలెంలో శతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు వారాహిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు బోగాపురపు వెంకటరమణ (బాబు), ఉదయగిరి చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో ఆషాడ మాసం శుద్ధ పంచమి పురస్కరించుకుని అమ్మవారిని వారాహి దేవిగా ఆదివారం అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరాహ నూకరాజు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వారాహిదేవిగా కనకదుర్గ దర్శనం

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

మాకవరపాలెం: ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న కేజీబీవీ (టైప్ -4)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఈవో మూర్తి తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ టైప్-4 కేజీబీవీని ప్రారంభిస్తామన్నారు. ఈ నేపథ్యంలో 9, 10 తరగతులతో పాటు ఇంటర్ విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నారాయణరావును సంప్రదించాలన్నారు.

ఘనంగా మోదమాంబ ఒడ్డు పండగ

మాడుగుల రూరల్ : ఎం.కోడూరులో మోదమాంబకు ఆదివారం భక్తులు ఒడ్డు పండగ నిర్వహించారు. గ్రామానికి చెందిన జాజిమొగ్గల వరహామూర్తి లక్ష్మి కుటుంబ సభ్యులు వరాహచంద్ర శ్రీనివాసు, వైకుంఠ వాసు, నవీన్ కుటుంబ సభ్యుల సారథ్యంలో 51 ఘటాలతో ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ఎంపీటీసీ సభ్యుడు రమణబాబు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు అప్పలనాయుడు పాల్గొన్నారు.

పత్రికాస్వేచ్ఛపై దాడులు అప్రజాస్వామికం

రాజవొమ్మంగి: నిజాన్ని నిర్భయంగా చెప్పే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాపై కొన్ని దుష్టశక్తులు కక్షగట్టాయని ఏపీడబ్ల్యూజేఎఫ్ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు పుట్టా రామరాజు అన్నారు. రాజవొమ్మంగిలో ఆదివారం జరిగిన ప్రెస్ క్లబ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ కక్షలతో పత్రికా కార్యాలయాలు, పత్రికా ప్రతినిధులపై జరుగుతున్న దాడులు ప్రజాస్వామ్యానికే కళంకమన్నారు. మొన్న సాక్షి కార్యాలయంపై, తాజాగా మహాటీవీ కార్యాలయంపై దాడులకు పాల్పడిన వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటువంటి ధోరణికి చరమగీతం పాడాలన్నారు. కాగా పత్రికా కార్యాలయాలపై జరుగుతున్న దాడికి నిరసనగా సోమవారం రెవెన్యూ, పోలీస్ అధికారుల వద్దకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం ఇవ్వాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ సూరిబాబు, గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సభ్యులు వినీత్, లక్ష్మణ్, శ్రీనివాస్, రాజు, భద్రరావు, శ్రీను పాల్గొన్నారు.